23 MAR 2020 SAKSHI

# విజయవంతమైన జనతా కర్ఫ్యూ

SAKSHI

- ఇంటికే పరిమితమైన ప్రజలు
- మూతపడ్డ వ్యాపార సముదాయాలు
- పోలీసుల నిరంతర పహారా
- నిర్మానుష్యంగా మారిన రహదారులు
- యానాం–ఏపీ సరిహద్దుల మూసివేత



భీమ్‌నగర్ చెక్‌పోస్టు వద్ద వివరాలను తెలుసుకుంటున్న ఆర్ఏఓ శివరాజ్‌మీనా



జనతాకర్ఫ్యూను పరిశీలిస్తున్న ఎస్పీ భక్తవత్సలం తదితరులు



కర్రలతో కట్టి మూసివేసిన యానాం- ఏపీ సరిహద్దులు

యానాం: యానాంలో జనతాకర్ఫ్యూ ను ఆదివారం ప్రజలు స్వచ్ఛందంగా పాటించారు. ఉదయం 5 గంటల నుంచే నియోజకవర్గ ప్రజలు ఇంటింకే పరిమితమై స్వీయనిర్బంధం విధించుకున్నారు. అదేవిధంగా వివిధ వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. అత్యవసరమైన మెడికల్ షాపులు మాత్రమే తెరిచారు. పెట్రోల్ బంకులు, హోటళ్లు, నిత్యావసర వస్తువుల దుకాణాలు తదితరమైనవి మూతపడ్డాయి. ముఖ్యంగా యానాం పట్టణంలో ప్రజలెవరూ రోడ్లమీదకు రాకపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారి వెలవెలబోయాయి. యానాం, అమలాపురం, విశాఖపట్టణం, రామచంద్రపురం తదితర ప్రాంతాలకు వెళ్లే జనంతో నిత్యం కిటకిటలాడే న్యూబస్టాండ్, పాతబస్టాండ్ ఏరియాలు వెలవెలబోయాయి. యానాంలో ఆంధ్రప్రదేశ్ కంటే తక్కువ ధరలో పెట్రోల్, డీజిల్ లభిస్తుండటంతో చాలామంది వాహనచోదకులు యానాం వస్తుంటారు. కాని పెట్రోల్ బంకులు మూసివేతతో ఎవరూ రాని పరిస్థితి కనిపించింది. మిగిలిన పర్యాటకేంద్రమైన రాజీవ్‌రివర్‌బీచ్‌సైతం వెలవెలబోయింది.

**సరిహద్దుల మూసివేత**

యానాం–తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులను మూసివేయడంతో వాహనాల రాకపోకలకు అడ్డుకట్టపడ్డట్టయ్యింది. ముఖ్యంగా నీలపల్లి సరిహద్దు ప్రాంతమైన పొట్టిశ్రీరాముల వారధివైపు, యానాం బైపాస్‌సెంటర్ భీమ్‌నగర్, గణపతినగర్ వైపు సరిహద్దులను మూసివేశారు. శంకరపాలెం వైపున వైఎస్సార్ విగ్రహం వైపు ఒక మార్గాన్ని మాత్రమే తెరిచిఉంచారు. ఈ నేపథ్యంలో యానాం ఎస్పీ భక్తవత్సలం, సీఐ గూటం శివగణేష్, ఎస్సైలు రాము, సుబ్బరాజు, కనకారావు, ట్రాఫిక్ ఎస్సై ఆల్ఫాన్స్‌రాజు, కనకారావు, బీట్ ఆఫీసర్ కడలి మధు తదితరులు వివిధ విభాగాలకు చెందిన ట్రాఫిక్, సాధారణ, రిజర్వుబెటాలియన్, హోమ్‌గార్డులు పహారా నిర్వహించి ఎక్కడికక్కడ పరిస్థితులను చక్కదిద్దారు.

**క్వారంటైన్‌లో ఇద్దరు అనుమానితులు.**

కరోనా అనుమానంతో ఇద్దరు వ్యక్తులను ఆదివారం క్వారంటైన్‌కు తరలించారు. స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన క్వారంటైన్ వార్డుకు లండన్ నుంచి వచ్చిన ఒక యువకుడ్ని, నెల్లూరు జిల్లానుంచి వచ్చిన వ్యక్తిని ఉంచారు. వారిని ఎక్కడికి వెళ్లవద్దని సూచించారు. పరిపాలనాధికారి శివరాజ్‌మీనాకు అందిన విశ్వసనీయ సమాచారంతో లండన్ నుంచి బొంబాయికి అక్కడ నుంచి హైద్రాబాద్‌కు వచ్చిన యువకుడ్ని శనివారం అర్ధరాత్రివేళ డీటీ జయచంద్రన్, ఆర్ఏఓ పీఏ కె.ప్రసాద్, వెల్ఫేర్ అధికారి రవికుమార్‌లు కష్టించి పట్టణమంతా శోధించి పట్టుకుని క్వారంటైన్‌కు తరలించారు.

**హైదరాబాద్ నుంచి వచ్చిన వారికి థర్మల్ ఇమేజ్ స్క్రీన్‌టెస్ట్‌లు**

యానాం: తెలంగాణ రాజధాని హైద్రాబాద్ నుంచి ఆదివారం ఉదయం యానాంకు ప్రైవేట్‌బస్సుల్లో వచ్చిన ప్రయాణికులకు స్థానిక భీమ్‌నగర్ చెక్‌పోస్టు వద్ద థర్మల్ ఇమేజ్ స్క్రీన్ టెస్ట్‌లను అధికారులు నిర్వహించారు. సుమారు 63మంది పుదుచ్చేరి, ముంబాయి, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాలు చేస్తున్న యానాం, ఏపీకి చెందిన యువకులకు, వారి కుటుంబసభ్యులకు పరీక్షలు నిర్వహించి వారికి హోమ్ క్వారంటైన్ రబ్బరుస్టాంపులను చేతులపై వేశారు. అదేవిధంగా ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై ద్రావణాన్ని పిచికారి చేశారు. అందరి వివరాలను అడ్రాసులును తీసుకుని వారిని కొన్ని రోజులపాటు ఇంటికే పరిమితం కావాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి మున్సిపల్ కమీషనర్ గుజ్జు గౌరీసరోజ స్నాక్స్, బిస్కెట్‌లు తదితరమైనవి పంపిణీ చేశారు. చెక్‌పోస్టు సిబ్బంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ గూటం రాంబాబు, మేడా గంగాధర్, టి.వీరభద్రరావు, ఎన్.రామన్న ఉన్నారు.

**చప్పట్లతో సంఘీభావం**

యానాం: కరోనా వైరస్ కట్టడి కోసం ప్రధాని మోదీ ఇచ్చిన జనాతా కర్ఫ్యూ పిలుపుమేరకు ఆదివారం యానాంలో ప్రజలనుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో నిబద్ధతతో ప్రజానికం జనతాకర్ఫ్యూను పాటించారు. సాయంత్రం 5గంటలకు ప్రజలంతా చాలా చోట్ల బయటకు వచ్చి చప్పట్లు కొడుతూ కరోనా నిరోధానికి తమవంతు సేవలుతో అహర్నిశలు పనిచేస్తున్న వైద్యసిబ్బంది, పారిశుద్యకార్మికులు, పోలీసులు, అత్యవసర సిబ్బందికి, పిడబ్ల్యు ఎన్ఎమ్ఆర్‌లకు, ఆశావర్కర్స్, ఎఎన్ఎమ్‌ల సేవలకు సంఘీభావం తెలుపుతూ చప్పట్లు కొట్టారు. పలుచోట్ల స్టీలుప్లేట్లు తో మోగించగా, భవనాల్లో ఉన్నవారు పై అంతస్థుల్లో నుంచి చప్పట్లు కొట్టి సేవలను అభినందించారు.

**ఉచితబియ్యం సొమ్ము ఖాతాల్లో జమ**

యానాం: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పలువురి వినతులు, డిమాండ్ల మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచితబియ్యం పథకం సొమ్మును రేషన్‌కార్డుదారుల బ్యాంకు అకౌంట్లలో తక్షణం జమ చేస్తున్నట్లు పుదుచ్చేరి సీఎం నారాయణసామి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఒక నెలకు సంబంధించి సొమ్మును వేయనున్నట్లు దీనికోసం రూ.27కోట్లను కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా కరోనా వైరెస్ నేపథ్యంలో ప్రజలవినతులను, డిమాండ్లను 93453 75069 వాట్సాప్ నెంబరుకు పంపాలని ఈనెల 31వరకు ఎవరూ కూడా వివిధ ప్రదేశాల్లో ఎక్కడా గుమికూడకుండా ఉండాలని కోరారు.

## 31 వరకూ షాపుల బంద్

**యానాం వర్తక సంఘం నిర్ణయం**

యానాం: కరోనా వైరెస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పుదుచ్చేరి ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ముందస్తుగా ఈనెల 31వరకూ యానాం నియోజకవర్గంలో వ్యాపారసముదాయాలను మూసివేస్తున్నట్లు వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఏఓ శివరాజ్‌మీనాతో వర్తకుల సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అత్యవసరమైన మెడికల్ షాపులు, కూరగాయషాపులు, పాల దుకాణాలు, కిరాణాషాపులు మినహాయించి మిగిలిన దుకాణాలు మూసివేయాలని దీనికి అందరూ వర్తకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపగంటి గోపాలకృష్ణ, అద్దేపల్లి కృష్ణ, కంచర్ల వీర్రాజు, పలుకూరి వంశీ, చినరాజు పాల్గొన్నారు.

**31వరకూ యానాంలో 144సెక్షన్**

యానాం: మార్చి 23 నుంచి 31 వరకూ పుదుచ్చేరివ్యాప్తంగా ఆంక్షలను ప్రభుత్వం పొడిగిస్తూ పుదుచ్చేరి సీఎం నారాయణసామి ప్రకటించిన నేపథ్యంలో యానాంలో సైతం దానిని అమలు చేయనున్నారు. ఇప్పటికే 144 సెక్షన్ అమలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలెవరూ సామూహికంగా గుమిగూడకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదవిధంగా పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ రీఫామ్స్ సలహా మేరకు ఎంపిక చేసిన శాఖలకు చెందిన 50శాతం గ్రూప్–బి,సి ఉద్యోగులకు ఇంటివద్ద నుంచే విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఆరోగ్య, కుటుంబసంక్షేమం, ఆయుష్, రెవెన్యూ, డిజాస్టర్‌మేనేజ్‌మెంట్, ఎక్సైజ్, పోలీసు, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పీడబ్ల్యూడీ, మున్సిపాలిటీలు, ట్రాన్స్‌పోర్టు, కమర్షియల్ టాక్స్, డీఏటీ, పీటీడీసీ, పవర్‌కార్పొరేషన్‌లకు ఈ నిర్ణయం వర్తించదని తెలిపారు.

## సరిహద్దుల మూసివేతపై ఎల్జీకి ఫిర్యాదు

యానాం: కరోనా వైరెస్ నేపథ్యంలో యానాం –తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులను మూసివేయడంపై ఎల్జీ కిరణ్‌బేడీకి ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ మాజీ అధ్యక్షుడు గుత్తుల జయరామారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా అంతర్భాగంగా ఉన్న యానాంకు ఆంధ్రప్రదేశ్ నుంచే అన్ని నిత్యావసర వస్తువులతో పాటు పాలు, నీరు తదితరమైనవి రావాల్సి ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సరిహద్దులను మూసివేయడం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనికి తోడు సరిహద్దులు మూసివేయడంతో సరిహద్దు వివాదాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని అన్నారు. చెక్‌పోస్టులు పెట్టిన నేపథ్యంలో సరిహద్దులు మూసివేత తగదని అన్నారు. ఈ నిర్ణయం ఏపీ వాసులుకు సైతం ఇబ్బందిగా మారిందని దీనిపై అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

## దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి

యానాం: దేశంలో కరోనా వైరెస్ ప్రవేశించిన నేపథ్యంలో దాని బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దూరప్రయాణాలను వాయిదావేసుకుని ఇంటి వద్దనే ఉండాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన పుదుచ్చేరి నుంచి విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా అనారోగ్యం అనిపిస్తే తక్షణం ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని వారి సలహాలను పాటించాలని కోరారు. ముఖ్యంగా బయటకు వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలని ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని కోరారు. జనతా కర్ఫ్యూను విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ENADU

**యూనాం:** యూనాంలో కరోనా వైరస్ నిరోధానికి తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణకు ప్రత్యేక పీసీఎస్ అధికారిని నియమించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆదివారం రాత్రి పుదుచ్చేరి నుంచి మీడియాతో మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలకు సహకరించడానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ నిపుణుడు డాక్టర్ సవేల్‌ను యానాం పంపినట్లు చెప్పారు. మార్చి నెలాఖరువరకు జనతా కర్ఫ్యూను పొడిగించాలని సీఎం నారాయణసామి నిర్ణయించారన్నారు. మార్చి 31 వరకు దుకాణాల మూసివేత నిర్ణయం అమలు, ఇతర అంశాలపై పరిపాలనాధికారి శివరాజ్‌మీనా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. విదేశాలనుంచి యానాం వచ్చిన ఇద్దరిని క్వారంటైన్‌హోంలో పరిశీలనకు ఉంచినట్లు పరిపాలనాధికారి తెలిపారు. మొత్తం 80 మంది ఇతర ప్రాంతాలనుంచి వచ్చినవారు ఇళ్లలో ఉండి వైద్యుల సలహాలు పాటిస్తున్నారని చెప్పారు. యానాంలో జరిగిన జనతా కర్ఫ్యూ విజయవంతమైంది. నియోజకవర్గంలోని అన్ని చెక్‌పోస్టులు, గ్రామాల్లో పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, ఎస్పీ ఆర్. భక్తవత్సలన్, సీఐ శివగణేష్, ఇతర అధికారులు తనిఖీలు చేశారు. యానాంలో జనతా కర్ఫ్యూ గురించి పుదుచ్చేరి సీఎం నారాయణసామి, ఆరోగ్యశాఖమంత్రి మల్లాడి కృష్ణారావు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం అయిదు గంటలకు వైద్యులు, అత్యవసర విధుల్లో ఉన్న ఉద్యోగులకు చప్పట్లు, వివిధ రకాల వాయిద్యాలు మోగించి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



యానాం: జనతా కర్ఫ్యూ పొడిగింపుపై చర్చిస్తున్న అధికారులు



యానాంలోకి ప్రవేశించే భీంనగర్ మార్గం మూసివేత

2 3 MAR 2020

ANDHRA JYOTHI
ANDHRA JYOTHI

## యానాంలో రెండు అనుమానిత కేసులు

**యానాం, మార్చి 22:** యానాంలో జనతా కర్ఫ్యూ విజయవంతమైంది. యానాం సమీప ప్రాంతంలో రెండు అనుమానిత కేసులు ఉండటంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. మరో అనుమానిత కేసును కాకినాడ తరలించారు ద్రాక్షారామ రోడ్డు మినహా అన్ని రహదారులను మూసివేశారు. వ్యాపార సంస్థలు అన్ని మూతపడ్డాయి. హైదరాబాద్ నుండి యానాం వచ్చిన బస్సులను శుభ్రం చేశారు. ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 14రోజులు ఇంటిలోనే ఉండాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 60మందిని హోమ్ క్వారంటైన్‌కు తరలిం

చామసి యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు.



యానాంలోకి ప్రవేశించే ముఖ ద్వారం మూసిన దృశ్యం

**VELUGU**

23 MAR 2020

# కరోనా వైరస్ పట్ల జాగ్రత్తలు పాటించాలి

## మంత్రి మల్లాడి

యానాం, మార్చి22(వెలుగు విలేకరి): ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్న కరోనా వైరస్ పట్ల ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు ఈ మేరకు ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు జనతా కర్ఫ్యూకి పుదుచ్చేరి ప్రభుత్వం పూర్తి మద్దతు ప్రకటించటంతో ప్రజలు విజయవంతం చేశారన్నారు. ఎవరికైనా ఎటువంటి అనారోగ్యం అనిపించినా తక్షణమే దగ్గర్లో ఉన్న వైద్య సిబ్బందిని కలిసి వారి సలహా మేరకు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించి చేతులు శుభ్రంగా కడుక్కుంటు అప్రమత్తంగా ఉండాలి అన్నారు వీలైనంత వరకు దూర ప్రయాణాలు వాయిదా వేయడంమంచిదన్నారు. ఎమీకాదు అనే నిర్లక్ష్యంగా ఉండటం మంచిది కాదన్నారు. జన సమూహానికి వీలైనంత వరకు దూరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ ఉధృతం తగ్గేంతవరకు ఇంటిలో ఉండటం ఉత్తమమన్నారు.

**ANDHRA PRABHA**

23 MAR 2020

# 31 వరకు కర్ఫ్యూ పొడిగింపు

## .. మద్దతు పలికిన వర్తక సంఘం

**యానాం, ప్రభన్యూస్ :** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వ్యాప్తంగా ఈనెల 31 వరకు కర్ఫ్యూను కొనసాగించాలని పుదుచ్చేరి ముఖ్య మంత్రి వి.నారాయణస్వామి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణా రావు లు పిలుపుమేరకు యానాం వర్తక సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. స్థానిక పరిపాలన అధికారి శివరాజ్ మీనా ఈ మేరకు వర్తక సంఘ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు మందుల షాపులు, పాలు, కిరాణా, కాయగూరలు మాత్రమే సమయపాలన నిబంధనలతో అనుమతులు జారీ చెసా మన్నారు మిగిలిన షాపులు మూసివేయాలని కోరడంతో వర్తక సంఘం మద్దతు తెలిపింది. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ మహమ్మారిని వ్యాప్తి చెందకుండా నివారించేందుకు చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని జాగ్రత్తలు పాటించాలి పరిపాలనాధికారి శివరాజ్ మీనా పిలుపునిచ్చారు.

**PRAJA SAKTHI**

23 MAR 2020



యానాం ఆసుపత్రిలో సిద్ధం చేసిన వార్డు